కాలువలు కూరుకుపోతున్నయ్..

- గుట్టుచప్పుడు కాకుండా వరద కాలువలను పూడ్చుతున్న వైనం
- కొన్ని చోట్ల కాలువలకు ఇరువైపులా ముళ్లపొదలు
- ఇళ్లలోకి, పంటపొలాల్లోకి చేరుతున్న వరదనీరు
- ఇబ్బందిపడుతున్న ప్రజలు


నాంపల్లి శివారులోని నిమ్మొర్రై వరద కాలువ

వేములవాడఅర్బన్: రోజురోజుకూ వరదకాలువలు కనుమరుగవుతున్నాయి. గతంలో ఈ వరద కాలువల్లో కూడిన మట్టిని ఎప్పటికప్పుడు తీస్తూ చుట్టూ చెట్లపొదలను తొలగించేవారు. ప్రస్తుతం వరద కాలువలను పట్టించుకునే వారే కరువయ్యారు. భూములకు రెక్కలు రావడంతో వరదకాలువల పక్కన ఉన్న భూ యజమానులు గుట్టు చప్పుడు కాకుండా కాలువలు పూడ్చుతున్నారనే ఆరోపణలున్నాయి. పెద్దగా ఉన్న నిమ్మొర్రైలను కూడుపుకుంటూ వస్తూ పిల్ల కాలువల వలే చేస్తున్నారు. రానున్న రోజుల్లో అసలు కాలువలు కనిపించకుండా పోతాయోనన్న అభిప్రాయాలున్నాయి. అధికారులు పట్టించుకొని వరదకాలువలను ఎప్పటిలాగే చేయాలని కోరుతున్నారు.

మారుపాక నుంచి ప్రారంభం

వేములవాడ మండలం మారుపాక చెరువు నుంచి వరదకాలువ ప్రారంభమవుతుంది. వర్షం కురిస్తే పంట చేన్లలోని వరదనీరు వరద కాలువల్లోకి చేరుతుంది. మారుపాక నుంచి తిప్పాపూర్ శివారులోని పిల్లిగుండ్ల నుంచి, అయ్యప్ప గుడి పక్కన నుంచి నాంపల్లి రోడ్డులోని సారలకాలనీ మీదుగా మూలవాగులోకి వరదనీరు చేరుతుంది. వర్షం కురిసింది అంటే ఈ నిమ్మొర్రై పారుతుంది. గతంలో వర్షంపడితే పంట నీరంతా ఇందులోకి చేరి నిమ్మొర్రై వర్షాకాలం అంతపారేది. కానీ ఇప్పుడు నిమ్మొర్రై కబ్జాలు, కాలువల పక్కన పిచ్చిమొక్కలు ఉండటంతో పట్టించుకునే వారు లేక నిమ్మొర్రై పెద్ద కాలువ పిల్ల కాలువల వలే మారింది. వరదనీరు వెళ్లలేక చుట్టూ ఉన్న ఇళ్లు, పంట భూముల్లోకి నీరు చేరుతోంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని వరద కాలువల్లోని పిచ్చిమొక్కలను తొలగించి, గతంలో కాలువలు ఎలా ఉన్నాయో అలాగే ఉండేలా కాపాడాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

ఇళ్లలోకి వరద నీరు

వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ శివారులో సారలకాలనీ ఉంది. ఈ కాలనీ నిమ్మొర్రై వరద కాలువకు కొంతదూరంలో ఉంటుంది. భారీ వర్షం కురిస్తే వరద నీరు ఇళ్లలోకి వస్తోందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కాలువలు చిన్నగా మారి, ముళ్లపొదలతో నీరు వెళ్లలేక ఇళ్లలోకి నీరు వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. ఏటా వర్షాకాలం వచ్చిందంటే వరదనీటితో ఇబ్బందిగా మారిందని, భయంభయంగా గడుపుతున్నామని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు కాలువల్లోని ముళ్లపొదలను తొలగించాలని కోరుతున్నారు.

భయంగా ఉంది



వర్షాకాలం వస్తే వరదనీరు వస్తుందని భయంగా ఉంది. ఏటా వర్షం కురిస్తే వరదనీరు నిమ్మొర్రై కాలువల్లో పట్టకుండా బయటకు వచ్చి ఇళ్లలోకి చేరుతోంది. దీంతో వర్షాకాలంలో ఇబ్బందిగా ఉంది.

– వెంకటేశ్వరి, సారలకాలనీ తిప్పాపూర్

గుడారాల్లోకి చేరుతోంది



ఇళ్లు నిర్మించుకోవాలంటే ఆర్థికస్థోమత లేక గుడారాలు వేసుకుంటూ జీవిస్తున్నాం. వానాకాలంలో భారీవర్షాలు కురిస్తే వరదనీరు గుడారాల్లోకి చేరుతుంది. దీంతో ఇంట్లో సామగ్రి తడిసి భయంగా గడుపుతున్నాం.

– భూలక్ష్మి, సారలకాలనీ తిప్పాపూర్

ముళ్లపొదలు తొలగించాలి



నిమ్మొర్రైలో ముళ్లపొదలు ఎక్కువగా పెరిగాయి. వర్షం కురిస్తే వరదనీరు సాఫీగా వెళ్లక నిలిచిపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిమ్మొర్రై కాలువలోని ముళ్లపొదలను తొలగించాలి.

– ప్రేమ్‌కుమార్, సారలకాలనీ తిప్పాపూర్

కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ప్రవీణ్ జే టోని

తంగళ్లపల్లి: అధికారంలో ఉన్నప్పుడు తన అనుచరులకు అక్రమంగా అసైన్డ్ భూములను కేటాయించి పట్టాలు ఇచ్చిన అప్పటి మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల భూపతి, ఎంపీటీసీ బైరినేని రాము, పట్టణ అధ్యక్షుడు నేరెళ్ల నర్సింగం గౌడ్, బీసీసెల్ అధ్యక్షుడు మల్లేశం యాదవ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం మధుకర్(ఛోటు), నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు చుక్క శేఖర్, ప్రశాంత్ కుర్మా, తిరుపతి యాదవ్, సత్తు శ్రీనివాస్ రెడ్డి, అరెపల్లి బాలు, మిరాల శ్రీనివాస్ యాదవ్, చందు, చిలుక శ్రీనివాస్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సత్యంకు పరామర్శ


ఎమ్మెల్యే సత్యంను పరామర్శిస్తున్న లక్ష్మణ్‌రావు

ఎల్లారెడ్డిపేట: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి ఇటీవల మృతిచెందగా ఎల్లారెడ్డిపేట జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు ఆయనను శుక్రవారం పరామర్శించారు. హైదరాబాద్‌లోని అల్వాల్ పంచశీల కాలనీలోని నివాసంలో ఆయనను పరామర్శించారు. ఆయనవెంట నాయకులు చందు, కాంతారావు తదితరులున్నారు.

పశువులు రోడ్లపై సంచరించకుండా చూడాలి

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో పశువులను ఇష్టానుసారం వదిలేయకుండా ఉండాలని సంచార పశువుల యజమానులకు మున్సిపల్ కమిషనర్ డి.లావణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో పశువులను యజమానులు సంచరించకుండా చూసుకోవాలన్నారు. మార్కెట్, బస్టాండ్, ప్రధానరోడ్లపై పశువులు సంచరిస్తుండటంతో ప్రజలను గాయపరుస్తున్నాయన్నారు. యజమానులు తమ పశువులను రోడ్లపైకి రాకుండా చూడాలని లేకపోతే వాటిని గోశాలకు తరలిస్తామని తెలిపారు.

పీవీకి ఘన నివాళి


వేములవాడఅర్బన్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు


వేములవాడరూరల్: నూకలమర్రిలో..


చందుర్తిలో కేక్ కట్‌చేస్తున్న నాయకులు

వేములవాడఅర్బన్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా వేములవాడ నందికమాన్ వద్ద అర్బన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిత్రాపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అగయ్య, కనుకయ్య, దేవరాజు, రాజిరెడ్డి, సతీశ్, శ్రీనివాస్, చంద్రయ్య, తిరుపతి, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

తంగళ్లపల్లి: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఆధ్వర్యంలో మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావు జయంతిని నిర్వహించారు. మండలకేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ నాయకులు లింగాల భూపతి, నేరెళ్ల నర్సింగం గౌడ్, ఎంపీటీసీ బైరినేని రాము, సత్తు శ్రీనివాస్ రెడ్డి, చుక్క రాజశేఖర్, మందాటి తిరుపతి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, నరేశ్, తలారి నర్సింలు, కొండల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, అనిల్, సత్తయ్య, భాను, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తిలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి బొజ్జ మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి గొట్టె ప్రభాకర్, నాయకులు పులి సత్తయ్య, దారం చంద్రం, బానాల రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం నూకలమర్రిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని పీవీ జయంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు బొడ్డు రాములు, రొండి రాజు, పాలకుర్తి పర్శరాములు, శంకర్, కృష్ణ, తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట: పీవీ జయంతి సందర్భంగా మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు పాపగారి రాజుగౌడ్, నాయకులు ప్రభాకర్, వెంకటి, నర్సింలు, దేశెట్టి రాజశేఖర్, గౌరీశంకర్, జంగం రాజు, బంగ్ల రాజుగౌడ్, లచ్చయ్య, విఠల్ నాయక్, నాంపల్లి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో పీవీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, లింగంగౌడ్, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, నంది కిషన్, రాములు, బాల్‌రాజ్‌యాదవ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ కార్మికులపై చిన్నచూపు

సిరిసిల్లటౌన్: రాజన్న ఆలయ కార్మికులపై చిన్నచూపు తగదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి రాములు కోరారు. సిరిసిల్లలోని కార్మిక భవనంలో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. వేములవాడ ఆలయంలోని పారిశుధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఓవర్ టైం డ్యూటీకి అదనపు వేతనం చెల్లించి, ఐడీకార్డులు ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి రాములు, అధ్యక్షుడు అజ్జ వేణు పాల్గొన్నారు.

2న మండల సమావేశం

కోనరావుపేట: మండల సర్వసభ్య సమావేశాన్ని జూలై 2న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శశికళ తెలిపారు. ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు, సభ్యులు హాజరుకావాలని కోరారు.


ఆలయంలో చండీహోమం

తంగళ్లపల్లి: మండలంలోని అంకుషాపూర్ రోడ్డులోని శ్రీ సంతోషి మాత ఆలయంలో జూలై 3న చండీహోమం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు లగిశెట్టి శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 3న ఉదయం 8:30 గంటలకు చండీహోమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. హోమంలో పాల్గొనే భక్తులు 9296203433 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

చందుర్తి: బీరుసీసాతో దాడిచేసి వ్యక్తిని గాయపర్చిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. లింగంపేట గ్రామానికి చెందిన మల్యాల రవికి, మంద గణేశ్‌కు పాత గొడవలున్నాయి. గురువారం సాయంత్రం మంద గణేశ్, కట్కూరి విశ్వాస్ రవిపై బీరు సీసాతో దాడికి దిగారు. దీంతో రవి తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వెంకట్‌రెడ్డి సేవలు మరువలేనివి


నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని రచ్చబండి వద్ద శుక్రవారం మాజీ సమితి అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి వర్ధతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వెంకట్‌రెడ్డి పాలరాతి విగ్రహం సొంత ఖర్చులతో ఏర్పాటు చేసేందుకు మాజీ జెడ్పీటీసీ వడ్నాల నర్సయ్య ముందుకొచ్చారు. పల్లె ప్రకృతి వనానికి వెంకట్‌రెడ్డి పేరు పెట్టాలని కోరుతూ ఎంపీడీవో సత్తయ్యకు వినతిపత్రం అందించారు. మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు నందికిషన్, మాజీ ఎంపీటీసీ బాల్‌రాజ్, నాయకులు అల్లం లక్ష్మణ్, ద్యాగం రాములు, బండారి బాల్‌రెడ్డి, వంగ గిరిధర్‌రెడ్డి, మేగి నర్సయ్య, రాంరెడ్డి, రాములు, సంతోష్‌గౌడ్, లింగం, ద్యాగం లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం


లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సతీశ్

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోట సతీశ్, సెక్రటరీగా భాస్కర్‌రెడ్డి, ట్రెజరర్‌గా రావుల లింగారెడ్డిలను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన లయన్స్ గవర్నర్ శివప్రసాద్ మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట లయన్స్‌క్లబ్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిందన్నారు. ఇదే స్ఫూర్తితో నూతన కార్యవర్గం ముందుకెళ్లాలని సూచించారు. లయన్స్ క్లబ్ సభ్యులు పయ్యావుల రామచంద్రం, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, నంది కిషన్, సద్ది లక్ష్మారెడ్డి, రావుల లింగారెడ్డి, కొమిరిశెట్టి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు పెరిగిన కూలి ఇవ్వాలి


మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: బీడీకార్మికులకు పెంచిన కూలీ రేట్ల ప్రకారం వేతనాలు చెల్లించాలని బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని పార్టీ ఆఫీసులో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. కార్మిక సంఘాల ఐక్య పోరాటాలతో బీడీ కార్మికులు, ప్యాకర్లకు నెలసరి వేతనాలు పెంచారన్నారు. మే 1 నుంచి పెరిగిన కూలి చెల్లించాల్సి ఉండగా, యాజమాన్యాలు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోవిందు లక్ష్మణ్, సూరం పద్మ, బెజిగం సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: చేనేత కళాకారులకు ఏటా రాష్ట్ర ప్రభుత్వం అందించే కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారాలకు అర్హులు, ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా జౌళిశాఖ సహాయ సంచాలకుడు ఎం.సాగర్ ప్రకటనలో తెలిపారు. చేనేతరంగంలో డిజైనర్లు, వృత్తి నైపుణ్యం గలవారు, ఇతర ప్రత్యేకతల ఆధారంగా ఎంపికైన కళాకారులకు రూ.25వేల నగదు శాలువా, జ్ఞాపికతో సత్కరించనున్నట్లు తెలిపారు. గతేడాది డిసెంబర్ 31 నాటికి 30 ఏళ్ల వయసుతోపాటు చేనేతరంగంలో పదేళ్ల అనుభవం ఉండాలన్నారు. డిజైనర్లకు పాతికేళ్ల వయసు ఐదేళ్లకు తగ్గని అనుభవం అవసరమని పేర్కొన్నారు. రూపొందించిన వస్త్రం శాంపిల్‌ను తనే స్వయంగా తయారు చేసినట్లు స్వీయ ధ్రువీకరణపత్రాన్ని అందజేయాలని సూచించారు. అర్హులు, ఆసక్తి గల చేనేత కళాకారులు దరఖాస్తుతోపాటు మరిన్ని వివరాల కోసం చేనేత, జౌళి శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

విజిబుల్ పోలీసింగ్‌తో ఫలితం

- నిబంధనలు పాటిస్తున్న ప్రయాణికులు



సిరిసిల్ల పోలీసుశాఖ ఏర్పాటు చేసిన విజిబుల్ పోలీసింగ్ త్రీడి చిత్రం

సిరిసిల్లక్రైం: రోడ్డు ప్రమాదాల నివారణకు ఈ ఏడాది కొత్తగా విజిబుల్ పోలీసింగ్ విధానాలను అమలు చేస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ఇప్పటికే ప్రకటించారు. సిరిసిల్ల కలెక్టర్ ఎదురుగా ఉన్న రగుడు చౌరస్తాలో, కరీంనగర్ నుంచి కామారెడ్డి వస్తున్న దారిలో దీనిలో భాగంగా పోలీసు, పెట్రో కారు వాహనంతో కూడిన త్రీడి యానిమెటెడ్ ఫోటోలను ఏర్పాటు చేశారు. అతివేగంగా వెళ్తున్న వాహనదారులతోపాటు, హెల్మెట్ ధరించని వాళ్లు యానిమెటెడ్ చిత్రాలను గమనించి అది నిజమైన వాహనం, పోలీసులు తనిఖీలు చేస్తున్నారని వెంటనే ఓవర్ స్పీడ్‌ను తగ్గించి వెళ్తున్న వీడియో శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. దీనితో తాము చేసిన విజిబుల్ పోలీసింగ్ విధానాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.

మామిడిపల్లి ఆలయానికి రూ.25వేల ఆదాయం


టెండర్ నిర్వహిస్తున్న ఆలయ అధికారులు, హాజరైన కాంట్రాక్టర్లు

వేములవాడ: రాజన్న దత్తత మామిడిపల్లి సీతారామ చంద్రస్వామి ఆలయానికి టెండర్ ద్వారా రూ.25,500 ఆదాయం సమకూరినట్లు ఏఈవో బ్రహ్మణగారి శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఆలయ చైర్మన్ చాంబర్‌లో మామిడిపల్లి దేవస్థానానికి సంబంధించిన వ్యవసాయభూమి 1.06 ఎకరాల స్థలం రెండేళ్ల కోసం టెండర్‌ను కె.రమేశ్‌కు అప్పగించినట్లు తెలిపారు. పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఏసీ ఆఫీస్ సత్యనారాయణ, నూగూరి నరేందర్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయం


వేములవాడలో మాట్లాడుతున్న వక్తలు

వేములవాడ: వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని పలువురు వక్తలు రైతులకు సూచించారు. సేవ్స్ ఆధ్వర్యంలో వేములవాడలో శుక్రవారం ఇండో జర్మన్ ప్రాజెక్ట్, తెలంగాణ అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సుకు పలువురు హాజరై మాట్లాడారు. పంట పెట్టుబడులు తగ్గించి దిగుబడి పెంచడంపై రైతులకు వివరించారు. డేటా ఆధారిత సాంకేతికతతో రైతులకు మెరుగైన సలహాలు, సూచనలు అందుతాయన్నారు. డాక్టర్ రఘు, డాక్టర్ పి.రఘురామిరెడ్డి, డాక్టర్ కల్పనశాస్త్రి, డాక్టర్ శ్రీనివాస్‌రావు, భాస్కర్, జయప్రకాశ్, అనంతకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'చేపపిల్లలు పంపిణీ చేయాలి'

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం వెంటనే చేపపిల్లలు పంపిణీ చేయాలని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ నిమ్మల బాబు కోరారు. ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని మిడ్‌మానేరు, అనంతగిరి, ఎగువమానేరు ప్రాజెక్టులతోపాటు 440 చెరువుల్లో చేపపిల్లలు వదలాల్సి ఉందన్నారు. గతేడాది బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 7వేలకు పైగా సొసైటీలకు చేపపిల్లలు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం త్వరగా చేపపిల్లల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

కోనరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ఇంటింటా తిరుగుతూ ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. పేరుకుపోయిన చెత్తచెదారాన్ని సిబ్బందితో తొలగించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు.

క్లుప్తంగా

ప్రతాప రామకృష్ణకు సన్మానం


ప్రతాప రామకృష్ణను సన్మానిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

వేములవాడ: బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ గుండె శస్త్ర చికిత్స అనంతరం కోలుకుని వేములవాడకు చేరుకోగా మై వేములవాడ ట్రస్ట్ ప్రతినిధులు శుక్రవారం ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో జోరుగా వానలు

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జోరుగా వానలు పడ్డాయి. ఇల్లంతకుంటలో అత్యధికంగా 50.4 మిల్లీమీటర్ల వర్షం పడగా.. అత్యల్పంగా చందుర్తిలో 5.1 మిల్లీమీటర్లు కురిసింది. రుద్రంగిలో 8.6, వేములవాడరూరల్‌లో 21.7, బోయినపల్లిలో 16.0, వేములవాడలో 43.9, సిరిసిల్లలో 41.9, కోనరావుపేటలో 23.2, వీర్నపల్లిలో 31.4, ఎల్లారెడ్డిపేటలో 20.1, గంభీరావుపేటలో 10.4, ముస్తాబాద్‌లో 17.7, తంగళ్లపల్లిలో 27.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో సగటు వర్షపాతం 24.5 మిల్లీమీటర్లుగా నమోదైంది.

నేడు మున్సిపల్ సమావేశం

వేములవాడ: వేములవాడ మున్సిపల్ సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు కౌన్సిలర్లకు 64 అంశాలతో కూడిన ఎజెండా కాపీలను శుక్రవారం పంపిణీ చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా రెండు నెలలుగా వాయిదాపడిన మున్సిపల్ సమావేశం తిరిగి శనివారం నిర్వహిస్తున్నారు. సమావేశానికి ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ హాజరుకానున్నారు.

ఎల్వోసీ అందజేత


ఎల్వోసీపత్రం అందజేస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్: మండలకేంద్రానికి చెందిన ఎండీ గౌస్ అనారోగ్యంతో బాధపడుతుండగా కాంగ్రెస్‌పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి శుక్రవారం ఎల్వోసీని అందజేశారు. గౌస్ రెండు నెలలుగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మెరుగైన చికిత్స కోసం రూ.2.50లక్షల విలువ చేసే ఎల్వోసీని బాధితుడి తల్లి యూసుఫ్‌బీకి అందజేశారు. చొప్పదండి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కొదురుపాకలో..

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన పెంజర్ల దేవరాజుకు మంజూరైన రూ.1,30 లక్షల ఎల్వోసీని కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు లబ్ధిదారుడికి అందించారు. ఎల్వోసీ మంజూరుకు సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు బొలుమాల శంకర్, పులి లక్ష్మీపతి, ఏనుగుల కనుకయ్య, బోయిని ఎల్లేశ్, నాగుల వంశీ తదితరులున్నారు.

డిగ్రీ కళాశాల మంజూరు చేయండి

ముస్తాబాద్: మండలకేంద్రానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు చింతోజు బాలయ్య విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ ఏడాది క్రితం ముస్తాబాద్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేసినట్లు ప్రకటించారన్నారు. ఇప్పటివరకు ఎలాంటి మంజూరుపత్రం రాలేదన్నారు. మండలానికి చెందిన వందలాది మంది పేద విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లలేక చదువు మానేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరారు.

రాయిని చెరువు సందర్శన



వీర్నపల్లి: మండలంలోని మద్దిమల్లలో రాయిని చెరువును గ్రామస్తులతో కలిసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొండూరు గాంధీ బాపురావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో చెరువు మరమ్మతులకు రూ.30 లక్షల వరకు మంజూరయ్యాయన్నారు. మాజీ సర్పంచ్, జోగుల సుదర్శన్, జవహర్‌లాల్, సంతోష్, లచ్చయ్య, రవి, మహేశ్, నాగరాజు, సతీశ్, దేవ్‌సింగ్, తిరుపతి గ్రామస్తులు పాల్గొన్నారు.

పరామర్శ

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి హైదరాబాద్‌లో గురువారం జరిగిన కారు ప్రమాదంలో స్వల్పంగా గాయపడగా.. పరామర్శలు వెల్లువెత్తుతున్నాయి. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు అంది సుభాస్, బందారపు బాల్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు.